
కాసిపేట : గురువాపూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## కుందారంలో చిరుతపులి సంచారం

**పాదముద్రలు గుర్తించిన అధికారులు**

జైపూర్, మే 7: మండలంలోని కుందారం, జైపూర్ క్రాస్ రోడ్ వద్ద అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా చిరుత పులి సంచరిస్తున్నట్లు గుర్తించామని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్ కుమార్ తెలిపారు. కుందారం సమీపంలోని అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ )నీలగిరి ప్లాంటేషన్ వద్ద రెండు రోజుల కిందట సంచరించిన చిరుతపులి పాదముద్రలు గుర్తించినట్లు చెప్పారు. అటవీ ప్రాంతం సమీపంలోని కుందారం, నర్సింగాపూర్, మద్దులపల్లి, ఆరెపల్లి గ్రామాల ప్రజలకు అడవిలోకి రావద్దని సూచించారు. చిరుతపులికి ఎలాంటి హాని కలిగించవద్దని తెలిపారు.


కుందారం అటవీ ప్రాంతంలో చిరుత పాదముద్రలు

# గడ్డం కుటుంబ పాలనతో ప్రజలకు నష్టమే..

- అందుబాటులో ఉండని వారితో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి..
- జనం కోసం పోరాడే కొప్పుల ఈశ్వర్‌నే గెలిపించండి
- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, మే 7 : గడ్డం వారి కుటుంబ పాలనతో జిల్లాకు నష్టమేనని, ఇప్పటికే అన్నాదమ్ములిద్దరూ ఎమ్మెల్యేలుగా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, మళ్లీ ఎంపీ ఎన్నికల్లో కొడుకును నిలబెట్టారని, ఈ కార్పొరేట్ వ్యాపారులతో జనానికి ఒరిగేదేమీ లేదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు నిచ్చారు. పెద్దపల్లి ఎంపీగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం కాసిపేట మండలంలోని గురువాపూర్‌లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ గెలిచిన తర్వాత నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు తాళం వేసి ఉంటున్నదని, ఆయన కోసం ప్రజలు ఇబ్బందులు పడుతూ హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తున్నదని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి, ఏ ఒక్కరికీ ఉద్యోగం కల్పించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాసుదేవ్, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, అక్కెపల్లి బుగ్గ రాజు, కరీం, సాయి కుమార్, శేఖర్, సుధాకర్, అంజన్ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

బెల్లంపల్లి, మే 7 : ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించేది బీఆర్ఎస్సేనని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. 6వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోలను చూసి భయపడిన రేవంత్ హుటాహుటిన రైతు భరోసా డబ్బులను రైతులకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. మిగిలిన హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టీబీజీకేఎస్ శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, నాయకులు రాజనాల రమేశ్, వెంకటరమణ, నూనెటి సత్యనారాయణ, కొమ్మెర లక్ష్మణ్ రేవెల్లి విజయ్, తాళ్లపల్లి మల్లయ్య, సాజిద్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.


వాకర్స్ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

**బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్**

భీమారం, మే 7 : బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేయాలని, ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కార్యకర్తలకు సూచించారు. భీమారం మండలంలోని ఎల్‌బీపేట్ గ్రామానికి చెందిన రైతు బంధు సమితి మాజీ కో ఆర్డినేటర్ చిప్ప పురుషోత్తంతో పాటు ఆయన తనయుడు చిప్ప రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం రామకృష్ణాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి బాల్క సుమన్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జనంపల్లి సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆత్కూరి రాము, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

# దొంగ ప్రమాణాలు చేస్తున్న కాంగ్రెస్‌ను నమ్మవద్దు

- అన్ని వర్గాలకు అండగా బీఆర్ఎస్
- పెద్దపల్లి ఎంపీగా ఈశ్వర్‌నే గెలిపించండి
- ఇంటింటా ప్రచారంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల టౌన్, మే 7 : సాధ్యంకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని అడుగుతుంటే దేవుళ్ల మీద దొంగ ప్రమాణాలను చేస్తున్నారని ఆ పార్టీని నమ్మవద్దని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం మంచిర్యాలలోని 8వ వార్డు పాతమంచిర్యాలలో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మహిళలకు రూ. 2500, పింఛన్ రూ.4వేలు, రుణమాఫీ చేస్తామని మాట మార్చారని, రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతామని అంటున్నారని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలందరూ గుర్తించారని, ఎందుకు ఓటు వేశామా ? అని బాధపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకపోగా, పాలనను సైతం గందరగోళంగా నిర్వహిస్తున్నదని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాలను కాపాడుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్సేనని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓటువేసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు ఎర్రం తిరుపతి, ధరణి శ్రీనివాస్, పెంట సత్యం, రమేశ్‌యాదవ్, శెట్టి శ్రీనివాస్, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.


పాత మంచిర్యాలలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


హాజీపూర్ : టీకన్నపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు


దహెగాంలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యంలో నిలిచిన వర్షపు నీరు


వేమనపల్లి : గాలివానకు విరిగి పడ్డ చెట్టు

# అకాల వర్షం.. రైతన్న ఆగమాగం..

**మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో గాలివాన బీభత్సం**

- నేలకొరిగిన వరిపైరు.. కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం..
- నేలరాలిన మామిడి.. విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు..
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం
- పిడుగు పడడంతో కాలిన తాటిచెట్టు
- కౌటాల మండలంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి
- ఉక్కపోత నుంచి జనం ఉపశమనం


వేమనపల్లి : నేలకొరిగిన వరి పైరు



> 'కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తే మాకు ఈ కష్టాలు ఉండేవి కావు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తడిచిన ధాన్యాన్ని తగిన రేటుతో కొనుగోలు చేయాలి. అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.' - రైతులు

*మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మంగళ వారం అకాల వర్షం అతలాకుతలం చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురియడంతో రైతులు ఆగమాగం అయ్యారు. కోతకు వచ్చిన వరిపైరు నేలకొరిగింది. కాతకు వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. కల్లాల్లో విక్రయానికి తెచ్చిన ధాన్యం తడిసిముద్దయింది. గంటలకొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు ఎగిరిపడ్డాయి. పిడుగుపడడంతో తాటిచెట్టు కాలిబూడిదైంది. ఎద్దు మృతిచెందింది.*


కౌటాల : పిడుగు పాటుకు మృతిచెందిన ఎద్దు


బెల్లంపల్లిరూరల్ : చంద్రవెల్లిలో ధాన్యంపై పాలిథిన్ కవర్లు కప్పిన రైతులు


చింతలమానేపల్లి : వర్షానికి పడ్డ వడగళ్లు


కన్నెపల్లి : రోడ్డుపై పడ్డ జడ్పీ పాఠశాల రేకులు

బెల్లంపల్లి రూరల్, మే 7 : బెల్లంపల్లి మండలంలో గంటకు పైగా వర్షం కురియడంతో కల్లాల్లోని ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యం కుప్పలపై టార్పాలిన్‌ను కప్పారు. చంద్రవెల్లి, పెద్దదుబ్బ, బట్వాన్‌పల్లిల్లో ధాన్యం తడిసింది. కోత దశలో ఉన్న వరిపైరు నేలకొరగడంతో రైతులు అపార నష్టాన్ని చవిచూశారు.

చెన్నూర్ రూరల్, మే 7 : చెన్నూర్ మండలంలోని కిష్టంపేట, లంబాడీపల్లి, కత్తరశాల, లింగంపల్లి, బావురావుపేట, కొమ్మెర, ఆస్నాద్, నాగాపూర్, సోమన్‌పల్లి, పొక్కూర్ లలో ధాన్యం తడిసింది. రైతులు హుటాహుటిన కవర్లు కప్పారు.

ఆసిఫాబాద్ టౌన్, మే 7 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన రాళ్ల వాన కురిసింది. జిల్లా కేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఇండ్లు, షాపుల్లోకి మురుగు నీరు చేరింది.

మందమర్రి రూరల్, మే 7 : సారంగపల్లిలోని కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన వడ్లు కొట్టుకు పోవడంతో రైతులు కాపాడుకోవడానికి అవస్థలు పడ్డారు. ఈదురుగాలులకు మామిడి కాయలు రాలాయి.

కౌటాల, మే 7 : నాగెపల్లి గ్రామంలో పిడుగు పడి మోర్లె దసురుకు చెందిన ఎద్దు మృతి చెందింది. ఎద్దు మేతకు వెళ్లగా పిడుగు పడడంతో అక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపాడు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచింది.

వాంకిడి, మే 7 : ఈదురు గాలులకు చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగడంతో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు.

హాజీపూర్, మే 7 : మండలంలోని గ్రామాల్లో వరి ధాన్యం పూర్తిగా తడిసింది. విద్యుత్ మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిలిచింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి, మాకు న్యాయం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

చింతలమానేపల్లి, మే 7 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది. చింతలమానేపల్లి, బాలాజీ అనుకోడ, బాబాపూర్, రవీంద్రనగర్, గంగాపూర్ గ్రామాల్లో రాళ్లతో కూడిన వర్షం కురిసింది.

తాండూర్, మే 7 : మండల కేంద్రంలోని మాదారం పోలీస్ స్టేషన్ మైదానం జలమయమైంది. బ్రాహ్మణవాడలో వర్షపు నీరు రోడ్డుపైనే నిలువడంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది తప్పలేదు. నీలాయిపల్లిలో ఈదురుగాలులకు మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో మామిడి కాయలు నేల రాలాయి. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పుకుని వర్షం భారి నుంచి కాపాడుకోవడానికి తిప్పలు పడ్డారు.

కోటపల్లి, మే 7 : కోటపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోగా.. రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగంపేటలో తాటి చెట్టు పైన పిడుగు వేయడంతో చెట్టు కాలింది.

బెజ్జూర్, మే 7 : మండలంలో తునికాకు సేకరణకు వర్షం కొంత నష్టం చేకూర్చినట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేమనపల్లి, మే 7 : మండలంలోని వేమనపల్లి, దస్నాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి.

భీమారం, మే 7 : మండల కేంద్రంలోని ఐడీడీఏ కాలనీలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో తేమ ఉన్న ధాన్యాన్ని కాంటకు వేయలేదని, హమాలీలు జోకేందుకు వస్తే వెనక్కు పంపించినట్లు రైతులు వాపోయారు. ఒక్కసారిగా వర్షం కురియడంతో ధాన్యం తడిసింది. విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది.

రెబ్బెన, మే 7 : మండలంలోని గోలేటిలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మామిడి కాయలు నేలరాలాయి.

కన్నెపల్లి, మే 7 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. మెట్‌పల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగి, కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

దహెగాం, మే 7 : దహెగాం, లగ్గాం, ఒడ్డుగూడ, గిరివెల్లి, చంద్రపల్లి, కొంచవెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రెండు నెలల క్రితం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలను ప్రాంభించిన అధికారులు కొనుగోళ్లు మాత్రం చేపట్ట లేదు.

సీసీసీ నస్పూర్, మే 7 : నస్పూర్ మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. తీవ్రమైన గాలివీయడంతో నస్పూర్ సబ్ స్టేషన్ పరిధిలోని షిర్కె క్వార్టర్స్ సమీపంలో 11 కేవీ విద్యుత్ లైనుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. తీగల్‌పహాడ్‌లోని ఏఎస్ఆర్ నగర్‌లో ఎల్‌టీ లైన్‌పై చెట్టు విరిగిపడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఏఈ రాంమూర్తి పర్యటించి నష్ట నివారణ అంచనా వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

జన్నారం, మే 7 : వార సంతకు వచ్చిన వ్యాపారుల దుకాణాల్లో వర్షపు నీరు చేరడంతో కూరగాయలు నీటిలో కొట్టుకు పోయాయి. సినిమా హాల్ రోడ్డులో పెద్ద ఎత్తన వర్షపు నీరు రోడ్డుపైన చేరడంతో రాకపోకలకు ప్రజల ఇబ్బందులు పడ్డారు.


సీసీసీ నస్పూర్ : నస్పూర్ షిర్కె ప్రాంతంలో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


జైపూర్ : రోడ్డుకు అడ్డుగా పడ్డ చెట్టును తొలగిస్తున్న స్థానికులు


మందమర్రి రూరల్ : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు


వాంకిడి : రహదారి పై పారుతున్న వరద

# కాంగ్రెసోళ్ల ప్రచారం కోసం.. ఉపాధి పనులు బంద్

మంచిర్యాల, మే 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెసోళ్ల ఆగడాలు రోజురోజుకూ పెచ్చు మీరిపోతున్నాయి. ఎన్నికల కోడ్‌ను ఆ పార్టీ పట్టించుకోవడం లేదు. ఇష్టం వచ్చినట్లు ప్రచారం, సభలు నిర్వహించుకుంటూ వెళ్లిపోతున్నది. మంచిర్యాల ఎమ్మెల్యే నైతే రోజుకో ఉల్లంఘన చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రంజాన్, శ్రీరామ నవమి పండుగుల రోజుల కోడ్ ఉల్లంఘించిన ఘటనల్లో ఇప్పటికే ఆయనపై కేసులు నమోదయ్యాయి. మొన్నటికి మొన్న హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో రాత్రి 10.30 గంటల తరువాత అర్ధరాత్రి 12 గంటలకు వరకు సమావేశం నిర్వహించి మరోసారి కోడ్ ఉల్లంఘించారు. దండేపల్లి మండలంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ఎమ్మెల్యే వచ్చినప్పుడు ఊళ్లలో జనం ఉండాలని చెప్పి ఉపాధి హామీ పనులనే నిలిపివేశారు. గుడిరేవు, అల్లీపూర్, తాళ్లపేట, రాజుగూడ, నాగసముద్రం, మాకులపేట, లింగాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిపివేయాలంటూ టీఏ(టెక్నికల్ అసిసెంట్లు) ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు ఆయా గ్రామాల్లో మంగళవారం పనులు జరగలేదు. ఎన్నికల ప్రచారం కోసం జనం ఉండేందుకని ఓ రాజకీయ పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఉపాధి హామీ పనులు ఆపడం గమనార్హం. ఇలా కాంగ్రెస్ పలుమార్లు కోడ్ ఉల్లంఘించడంతో ఆ పార్టీ నాయకుల వ్యవహారశైలిపై చర్చ నడుస్తున్నది. ఇప్పటికైనా కాంగ్రెసోళ్లు తీరు మార్చుకోవాలని, రాజకీయ స్వార్థం కోసం ఉపాధి పనులు ఆపి కూలీల పొట్ట కొట్టడం ఏంటని జనం మండిపడుతున్నారు. తాము ఈ విషయం చెప్పినట్లు తెలిస్తే ఎక్కడ ఇబ్బంది పెడతారోనని భయపడిపోతున్నారు. అలా ఉంది మరీ అధికార పార్టీ వ్యవహారశైలి.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వేదికగా 'కాంగ్రెసోళ్ల లొల్లి'

- బూత్ కమిటీల ఏర్పాటుపై రెండు వర్గాల మధ్య వాగ్వాదం
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించి క్యాంప్ ఆఫీస్‌లో రాజకీయ కార్యకలాపాలు

చెన్నూర్, మే 7: చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వేదికగా కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు గొడవకు దిగాయి. ఎన్నికల కోడ్ ఉన్నందున క్యాంపు కా ర్యాలయంలో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు నిర్వహించకూడదు. నిబంధనలు ఉల్లంఘించి క్యాంపు కార్యాలయంలోనే మంగళవారం కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలు నియమించేందుకు ఎమ్మెల్యే వివేక్‌కు సంబంధించిన పీఏ సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఇందులో రెండు వర్గాల మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీలోకి రావడం, వచ్చి రాగానే టికెట్ తెచ్చుకోవడం, ఆయనతో పాటు కొంత మందిని పార్టీలోకి తీసుకువచ్చారు. పాత బూత్ కమిటీల స్థానంలో కొత్తగా పార్టీలోకి వచ్చిన వా రితో కొత్త కమిటీలను ఏర్పాటు చేయడాన్ని సీనియర్లు అడ్డుకున్నారు. తాము పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పటి నుంచి పని చేస్తున్నామని, మమ్మల్ని కాదని కొత్తగా వచ్చిన వారితో బూత్ కమిటీలను ఎలా నియమిస్తారని నిలదీశారు. దీంతో పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు, సీనియర్లకు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ గొడవ పెద్దగా అవుతుందని భావించిన సదరు ఎమ్మెల్యే వివేక్ పీఏ బూత్ కమిటీలను నియమించకుండానే క్యాంపు కార్యాలయం నుంచి పలాయనం చిత్తగించినట్లు సమాచారం.